క్లుప్తంగా

ఘనంగా అన్న సమారాధన



పందలపాకలో అన్న సమారాధన చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని వినాయకనగర్ కాలనీలో రాజరాజేశ్వరి ఆలయం వద్ద దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా ఆదివారం అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. పందలపాక, తొస్సిపూడి, కొమరిపాలెం, కొంకుదురు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, కర్రి ఇస్రారెడ్డి, పడాల వీర్రాఘవరెడ్డి, పడాల వెంకటరెడ్డి, గొలుగూరి చంద్రారెడ్డి, గొలుగూరి కోదండం, రామారెడ్డి, జరజాపు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలి



అనపర్తిలో పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుమంత్

పెదపూడి: సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ అన్నారు. అనపర్తి పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లు, పాత నేరస్తులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుమంత్ మాట్లాడుతూ రౌడీషీటర్లు, పాత నేరస్తులు ఎలాంటి అల్లర్లకు పాల్పడవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే తమ సర్కిల్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యదేవుడికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి స్వామివారు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణ మూర్తి స్వామివారి ఆలయంలో ఆదివారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వ్రత పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి అన్నదాన ప్రసాదం పంపిణీ చేశారు.

రహదారుల అభివృద్ధికి కృషి



రహదారులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి: నియోజవర్గంలో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం పొలమూరు, పులగుర్త, కుతుకులూరుల్లో నిర్మించే రహదారులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రూ.14 కోట్లతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి, పందలపాక, ఊలపల్లి, బిక్కవోలు, ఇలపల్లి, రంగాపురం, బలభద్రపురం, కాపవరం గ్రామాల్లో రూ.2,59,16,000 నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కోరుకొండ మండల అధికారులు

ఎంపీడీఓ	బత్తిన అశోక్ కుమార్ 94413 83567
తహసీల్దార్	సుస్వాగతం 80088 03195
వ్యవసాయశాఖ ఏడీ	మల్లికార్జునరావు 83310 56576
సీఐ	సత్య కిషోర్ 94409 04829
ఎస్సై	శ్యామ్ సుందర్ 94409 04831
ఎక్సైజ్ సీఐ	శ్రీనివాస బాలాజీ 98484 42997

ప్రజారోగ్యానికి రక్షణ కరవు

- పలు చోట్ల అపరిశుభ్రంగా రక్షిత నీటి పథకాలు
- క్లోరినేషన్‌కు సైతం నోచుకోని వైనం
- కలుషిత జలంతో అంటువ్యాధులు
- పైపు లైన్ల లీకేజీలపై అలముకున్న నిర్లక్ష్యం
- అధికారులు దృష్టి సారిస్తేనే పరిష్కారం



శుభ్రతకు నోచుకోని పశ్చిమగానుగూడెం జీఎల్ఆర్ రక్షిత పథకం

రాజానగరం: పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తేనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యమవుతోందనేది అందరికీ తెలిసిన విషయమే. పరిశుభ్రమైన తాగునీరు ప్రజలకు అందివ్వడం ద్వారానే ఇది సాధ్యమవుతోందనేది నిర్వివాదాంశం. అయితే ప్రజారోగ్యానికి ప్రధానంగా చెప్పుకునే పరిశుభ్రమైన తాగునీటిని అందించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రామాలలో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చే విధంగా బోర్లు వేసి, ఓవర్ హెడ్ ట్యాంకు (ఓహెచ్‌ఆర్)లు నిర్మిస్తారు. ఆ ట్యాంకుల నుంచి పైపుల ద్వారా కుళాయిల నుంచి ప్రజలకు నీటి సరఫరా చేస్తుంటారు. వీటి నిర్వహణను ఆయా పంచాయతీలతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ (రూరల్ వాటర్ సప్లై అండ్ శానిటేషన్ డిపార్టుమెంట్) శాఖ పర్యవేక్షిస్తుంది. ఓహెచ్‌ఆర్‌లను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్ర పరచి, ప్రతిరోజు క్లోరినేషన్ చేసి నీటిని సరఫరా చేయవలసి ఉంటుంది. ఇందుకు సంబంధించిన పనులను పై రెండు శాఖలు పర్యవేక్షిస్తుంటాయి. అయితే ఈ విధమైన ప్రక్రియ చాలా చోట్ల అమలు జరగడం లేదనేది జలమెరిగిన సత్యం. పంచాయతీ అధికారులకు గుర్తుకు వచ్చిన సమయంలో తూతూ మంత్రంగా ట్యాంకులను శుభ్ర పరచి, బిల్లులు పెట్టేసుకుంటారనే విమర్శలు ఉన్నాయి. తద్వారా ఆయా ట్యాంకుల నుంచి పంపిణీ చేసే నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదముంటుంది. ముఖ్యంగా వర్షాకాలంలో వీటి వలన తరచు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమై, సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. ఇటువంటి సమయాలలో ఆయా పంచాయతీల సిబ్బంది చేసే హడావిడి అంతా ఇంతా కాదు. అదే ప్రక్రియ కనీసం నెలకోసారైనా క్రమం తప్పకుండా చేస్తూ, ఓహెచ్‌ఆర్‌లను పరిశుభ్రంగా ఉంచుతూ, నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేస్తే ఆరోగ్యకర సమాజానికి బాటలు వేసిన వారవుతారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

వాటర్ ట్యాంకులను క్లీనింగ్ చేయడమే కాకుండా వాటి పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడవలసిన బాధ్యత పంచాయతీలపై ఉంది. పట్టించుకోకపోతే చెత్తా చెదారాలకు నిలయంగా మారి అపరిశుభ్రత తాండవిస్తుంది. ఈ క్రమంలో పురుగు, పుట్ర ఎక్కువై నీరు కలుషితం కావడం జరుగుతుంటుంది. ఆ నీటిని తాగి ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే సందర్భాలు కూడా తరచుగా కనిపిస్తుంటాయి. వాటర్ ట్యాంకులను తరచు శుభ్ర పరిచేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేలా చూడవలసిన బాధ్యత పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులదే.

పైపు లైన్ల లీకులు అరికట్టాలి

గ్రామాల్లోనే కాదు పట్టణాలలో సైతం నీటిని సరఫరా చేసే పైపులు అక్కడక్కడా లీకవుతుంటాయి. ఆ లీకులను సకాలంలో గుర్తించి మరమ్మతులు చేయాలి. లేకుంటే ఆ లీకుల ద్వారా వ్యర్థాలు లోపలికి చేరి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రాజానగరం నియోజకవర్గంలో 225 వాటర్ ట్యాంకులుండగా అనపర్తి నియోజకవర్గంలో 123 ట్యాంకులున్నాయి.

సీతానగరంలో ఇద్దరి మృతికి కారణం

వాటర్ ట్యాంకులను నెలల తరబడి శుభ్రపరచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన వర్షాకాలంలో దాని ప్రభావం ప్రజలపై ఎక్కువగా చూపిస్తుంది. ఈ క్రమంలోనే సీతానగరంలో మూడు నెలల క్రితం అతిసార వ్యాధి ప్రబలి 25 మంది వ్యాధికి గురి కావడంతో వారిలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను శుభ్రపరచి, ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని అధికారులు ఆదేశాలిస్తున్నా క్రింది స్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజారోగ్యానికి శాపంగా పరిణమిల్లుతోంది.

నియోజకవర్గంలో రాపాక, ముగ్గళ్ల, వంగలపూడి, ఇనగంటివారిపేట, పురుషోత్తపట్నం, నాగంపల్లి, పశ్చిమగానుగూడెం, బూరుగుపూడి, గాదరాడ, కనుపూరు, బొల్లెద్దుపాలెం, కోటికేశవరం, శ్రీరంగపట్నం బీసీ కాలనీ, తూర్పుగానుగూడెం, కలవచర్ల, సీతారామపురం, నరేంద్రపురం, నందరాడ, వెలుగుబంద, చక్రద్వారబంధం, తుంగపాడు, రామస్వామిపేట, కానవరం, ముక్కినాడపాకలలో రక్షిత పథకాలు శుభ్రతకు నోచుకోవటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బూరుగుపూడిలో శిథిలావస్థకు చేరువైన ట్యాంకునే ఇప్పటికీ ఉపయోగించడం కొసమెరుపు.

> **15 రోజులకోసారి విధిగా శుభ్రం చేయాలి**
>
> 
>
> ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి విధిగా శుభ్ర పరచవలసి ఉంటుంది. అలాగే ఆ నీటిని ప్రతిరోజు క్లోరినేషన్ చేసి, సరఫరా చేయాలి. పీఆర్ యాప్ ద్వారా గ్రామ సచివాలయ సిబ్బందికి ఎప్పటికప్పుడు సమాచారమిస్తూ వారు చేపడుతున్న చర్యలపై దృష్టి పెడుతున్నాం. ట్యాంక్ క్లీనింగ్ చేసే సమయంలో ఫోటోలు తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది. నీటిని క్లోరినేషన్ చేసిన వివరాలను ఆయా ట్యాంకుల వద్ద గోడలపై లిఖించవలసి ఉంటుంది.
>
> సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, కోరుకొండ.

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా..

- అధ్వానంగా రహదారులు
- రాకపోకలకు తీవ్ర అవస్థలు
- తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టని ప్రభుత్వం



గోతులమయంగా మారిన బొల్లెద్దుపాలెం - కోరుకొండ రోడ్డు

మధురపూడి: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు గోతులమయంగా మారాయి. వాటిపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా రోడ్లపై తాత్కాలిక మరమ్మతులను సైతం ప్రభుత్వం చేపట్టడం లేదు. కోరుకొండ మండలంలో 22 గ్రామాలున్నాయి. ఈ గ్రామాలను అనుసంధానం చేస్తూ ఆర్అండ్‌బీ, పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ రోడ్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇవన్నీ గోతులమయంగా మారడంతో వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. కాపవరం - ముగ్గళ్ల వయా మునగాల, కోరుకొండ - గరగలం పాలెం వయా బొల్లెద్దుపాలెం, రాఘవపురం - కోటి కేశవరం, నర్సాపురం - రాజవరం, గాదరాడ - సీతారామపురం, బూరుగుపూడి -బుచ్చెంపేట, బుచ్చెంపేట - ఉండేశ్వరపురం, గాడాల - నిడిగట్ల రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గోతుల్లో నీరు చేరడంతో మరింత శిథిలమయ్యాయి.

నర్సాపురం జెడ్పీ పాఠశాలలో చోరీ

రూ.1.20 లక్షల విలువ చేసే ప్యానల్ అపహరణ



ప్యానల్ చోరీ ఫిర్యాదును తీసుకుంటున్న పోలీసులు

మధురపూడి: కూటమి ప్రభుత్వంలో మహిళలు, సామాన్యులకే కాదు.. ప్రభుత్వ పాఠశాలలకు కూడా రక్షణ లేకుండా పోయింది. కోరుకొండ మండలం నర్సాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్యానల్ (ఎల్‌ఈడీ స్క్రీన్) చోరీకి గురయిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. దీని విలువ సుమారుగా రూ.1.20లక్షలు ఉంటుంది. దీంతో పాఠశాలల్లోని సాంకేతిక పరికరాలను సైతం కాపాడలేని స్థితికి ప్రభుత్వ పాలన దిగజారింది. పాఠశాలల రక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టక పోవడంతో చోరులకు అవకాశంగా మారింది. స్థానిక ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం దీనికి అద్దం పడుతోంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్కూల్ భవనం గ్రామానికి దూరంగా ఉండటం, చుట్టూ ప్రహారీ గోడ లేకపోవడం చోరులకు అనువయ్యింది. స్కూలు ప్రవేశంలోని గేటు తాళం పగిలి వేలాడుతుండటంతో స్థానికులు ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులకు తెలియజేశారు. గ్రామ సర్పంచ్ కడియాల పాపారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు పరిశీలించగా ప్రధాన ద్వారం తాళాన్ని పగలగొట్టి లోపలకి చొర బడినట్టు తెలుస్తోంది. పదో తరగతి గది తాళాన్ని కూడా పగలగొట్టి గదిలోని పాఠాలు బోధించే ప్యానల్ (ఎల్‌ఈడీ స్క్రీన్)ను చోరీ చేసినట్టు నిర్ధారించారు. దీంతో స్కూల్ హెచ్ఎం విజయశ్రీ కోరుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై శ్యామ్ సుందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాఠశాల భవనంలో 250 మంది విద్యార్థులుంటారు.

కోరుకొండలో శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న లూథరన్ మహిళా క్రైస్తవులు

మధురపూడి: ఏఈఎల్‌సీ ఆధ్వర్యంలో కోరుకొండలోని మహిళా క్రైస్తవులు ఆదివారం శాంతి ర్యాలీ చేశారు. ప్రపంచంలో యుద్ధాలు సమసిపోయి శాంతి ఏర్పడాలని యేసు క్రీస్తును ప్రార్థిస్తూ ర్యాలీ నిర్వహించారు. రోగాలులేని, ఆరోగ్యవంతమైన రాష్ట్రం కావాలని కాంక్షిస్తూ పురవీధుల్లో తిరిగారు. తూర్పుగోదావరి సినడ్ బిషప్ రైట్ రెవరెండ్ ఏ.శామ్యూల్‌రాజ్, సినాడికల్ ప్రెసిడెంట్ ఏ లావణ్య శామ్యూల్‌రాజ్ ఇచ్చిన సంయుక్త పిలుపులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక పశ్చిమగానుగూడెంలోని సెంటినరీ సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీని ప్రధాన రహదారి గుండా కోరుకొండ వరకు నిర్వహించారు. వందలాది మంది మహిళలు పాటలు పాడుతూ, బైబిల్ చదువుతూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డెలిగేట్ గొల్లపల్లి ప్రవీణ్, కోశాధికారి ఈతకొట్టు ఎజ్రా తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులకు మౌలిక వసతులు కల్పించాలి



సింగంపల్లిలో ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

రంగంపేట: మండలంలోని సింగంపల్లి గ్రామంలోని సీపీ రెడ్డి (చంద్ర పుల్లారెడ్డి) నగర్ కాలనీ వాసులకు మౌలిక వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం(ఏపీఆర్‌సీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ఎందరో నిరుపేదలు సింగంపల్లి గ్రామంలోని సీపీ రెడ్డి నగర్‌లో ఇల్లు కట్టుకుని గత 30 ఏళ్లుగా జీవిస్తున్నారన్నారు. వారికి రోడ్లు, డ్రైనేజీ వంటి సౌకర్యాలు లేవని, వర్షం వస్తే కాలనీ మునిగిపోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కాలనీలో చాలా మందికి విద్యుత్ సౌకర్యం, వ్యక్తిగత మరుగుదొడ్లు లేవన్నారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని కాలనీ వాసులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎస్టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, మడికి సత్యం, ఎల్లో సత్తిబాబు, పారిశుద్ధ్య కార్మికుల సమాఖ్య కన్వీనర్ ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిన వరి.. అన్నదాతకు అదనపు ఖర్చు



రఘుదేవపురంలో వర్షాలకు నేలకొరిగిన వరి

సీతానగరం: మండలంలోని రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు వరిపంట కుంగి నేలను తాకింది. ఖరీఫ్ సీజన్‌లో మోటార్ల వద్ద వేసిన పంట వరి కంకులు వేసి ఏపుగా పెరిగింది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు నేలకు ఒరిగిపోయింది. దీనితో కంకులకు ధాన్యం గింజలు మొలకెత్తే అవకాశం ఉంది. మండల పరిధిలో గల గ్రామాల్లో ఈ విధంగా కుంగిన వరిపంట సుమారు 300 ఎకరాలు ఉండవచ్చని అంచనా. నేలను తాకిన వరి దుబ్బులను పైకి లేపి కట్టడానికి ఎకరానికి రూ.2 వేలు ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. దీనిపై మండల వ్యవసాయ శాఖాధికారులు రైతులకు పలు సూచనలు ఇచ్చారు. నీరు నిలువ లేకుండా చూడాలని, పడిన వరిపంటపై ఉప్పు కలిపిన ద్రావకాన్ని పిచికారీ చేయాలని సూచించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట నేడు ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట నిరసన తెలుపుతామన్నారు.

జాతీయ చదరంగం పోటీలకు అనన్య

ప్రకాశం నగర్: ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విజయనగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 9 ఓపెన్ కేటగిరీ బాలికల విభాగంలో నగరానికి చెందిన చింతా అనన్య సత్తా చాటింది. రెండు రౌండ్లకు 6 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. డిసెంబర్‌లో పూరీలో జరిగే అండర్ 9 జాతీయస్థాయి చదరంగం పోటీలకు అనన్య మన రాష్ట్రం తరపున ప్రాతినిథ్యం వహించనుంది.

ఇక రహదారి గతి ఇంతేనా..!



రఘుదేవపురం వద్ద గోతులు పడిన రాజమహేంద్రవరం- సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు

- రఘుదేవపురం నుంచి సీతానగరం వరకూ ప్రయాణం నరకం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

సీతానగరం: రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు ప్రధాన రోడ్డు శిథిలమై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ రోడ్డు దుస్థితి ఇక ఇంతేనా అంటూ మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా రాజమహేంద్రవరం - సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరణ చేసి రఘుదేవపురం శివారు వరకు పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా మిగిలిన రోడ్డు పనులు నిలిపివేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయినా రోడ్డును పట్టించుకున్న దాఖలాలు లేవు. గంపెడు మట్టి గోతుల్లో వేసిన వైనం లేదు. రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు రెండు కిలోమీటర్ల మేర రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా మారింది. రోడ్డుపై పడిన గోతుల నుంచి వెళ్లే వాహనాలు క్రింద భాగంలో తగిలి మరమ్మతులకు గురవుతున్నాయి. ద్విచక్ర వాహనదారుల కష్టాలు వర్ణనాతీతం. వర్షం వస్తే గోతుల్లోకి నీరు చేరి ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడటంతో ప్రయాణం చేయాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.

ఘనంగా హాస్యనటుడు రాజబాబు జయంతి



నటుడు రాజబాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

మధురపూడి: హాస్యనటుడు రాజబాబు 87వ జయంతిని శనివారం కోరుకొండలో ఘనంగా నిర్వహించారు. కోరుకొండ కళాశాల ఏర్పడటానికి కారకుడిగా, విద్యా ప్రదాతగా నిలిచిన రాజబాబుకు స్థానికులు ఘనంగా నివాళులు అర్పించారు. హైస్కూల్ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. స్కూల్ చైర్మన్ టి.శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాతా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ..కోరుకొండకు విద్యా ప్రదాతగా రాజబాబు చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. స్థానిక జూనియర్ కాలేజీలో సైతం రాజబాబు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పారు.

చికిత్స పొందుతూ పీజీ విద్యార్థిని మృతి



కుంచె పల్లవి (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పీజీ విద్యార్థిని కుంచె పల్లవి (22) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. హుకుంపేట వరలక్ష్మీ కాలనీకి చెందిన కుంచె పల్లవి నన్నయ యూనివర్సిటీలో పీజీ చదువుతోంది. ఈ నెల 19వ తేదీ శనివారం ఉదయం కాలేజీకి వెళ్లడానికి పల్లవిని ఆమె తండ్రి ఏసురత్నం లాలాచెరువులో దించాడు. అక్కడ బస్సుకోసం ఎదురుచూస్తుండగా తోటి విద్యార్థిని ద్విచక్ర వాహనంపై వచ్చింది. దీంతో వారిద్దరూ ఇద్దరు కళాశాలకు బయలుదేరారు. అదే మార్గంలో కాకినాడ డిపోకు చెందిన కాకినాడ - రాజమహేంద్రవరం నాన్‌స్టాప్ బస్సు లాలాచెరువు మీదుగా వెళుతూ వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని తాకింది. ఆ సమయంలో పల్లవి వెనుక పుస్తకాల బ్యాగ్ ఆ బస్సు నిచ్చెనకు చిక్కుకుంది. దీంతో బస్సు వేగానికి ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ పడిపోయారు. డ్రైవింగ్ చేస్తున్న విద్యార్థిని ఒక వైపునకు పడగా ఆమెకు స్వల్పగాయాలు అయ్యాయి. పల్లవి బస్సు చక్రం కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పల్లవి ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. ఈ మేరకు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరలక్ష్మి కాలనీలో విషాదఛాయలు

కుంచె ఏసురత్నం, శిరోమణి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారిలో పల్లవి పెద్ద కుమార్తె. ఏసురత్నం ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బాగా చదువుకుని, కుటుంబానికి అండగా ఉంటుందనుకున్న పల్లవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడాన్ని తల్లిదండ్రులు, చెల్లెళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమె మృతితో ఆ ప్రాంతంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

బీసీలకు రక్షణ చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నూకాలమ్మ

సీటీఆర్ఐ: బీసీలకు రక్షణ చట్టం చేయాలని, కులగణన చేపట్టాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి వై.నూకాలమ్మ, సంఘ జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు కోరారు. బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లద్దిక మల్లేష్ తల్లి కనకదుర్గమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాలతో నూకాలమ్మ, నాగేశ్వరరావు ఆదివారం మధ్యాహ్నం స్థానిక గంటాలమ్మ గుడి దగ్గర ఉన్న మల్లేష్ ఇంటికి విచ్చేసి, పరామర్శించారు. కనకదుర్గమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వై.నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్, కులగణన చేపట్టేలా చూడాలన్నారు. జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో 50 శాతం నిధులు కేటాయించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాజకీయాలకు అతీతంగా బీసీల అభ్యున్నతికి పనిచేస్తోందని, గ్రామస్థాయి నుంచి ఉద్యమ నిర్మాణం చేపడుతోందన్నారు. సమావేశంలో కేకే సంజీవరావు, ప్రచార కమిటీ కన్వీనర్ కనిశెట్టి లక్ష్మణరావు, నాయకులు బత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.